ఆదివారం అనుబంధం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
మంగళవారం 08 ఆగస్టు 2023

నిత్యావసర సరుకులు అందించిన రిటైర్డ్ ఆర్మీ జవాన్

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బాబాపూర్ గ్రామంలో కొన్ని రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జవదే మంగ ఇల్లు నేలమట్టం అవడంతో రిటైర్డ్ ఆర్మీ జవాన్, శివపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకుమార్ సొంత ఖర్చులతో నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఆరే సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, విజయ్, మహేష్ పాల్గొన్నారు.



ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రం ప్రారంభం

సారంగాపూర్ : మండల కేంద్రంలో ఎస్బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని బ్యాంకు మేనేజర్ ప్రశాంత్ సోమవారం ప్రారంభించారు. బ్యాంక్‌తో పాటు ఖాతాదారులు సేవా కేంద్రాన్ని సైతం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కేంద్రంలో ఎలాంటి రుసుము లేకుండా చిన్నచిన్న పొదుపు, డిపాజిట్లు, విత్‌డ్రా, బీమా వంటివి చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కస్టమర్, రిలేషన్‌షిప్ ఆఫీసర్ తోట రాజేశ్వర్, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్, క్యాషియర్ వెంకటకృష్ణ, క్లర్క్ రాకేష్‌గౌడ్, ఈశ్వర్, ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వాహకులు ఎనుగంటి సంధ్య చంద్రమోహన్‌గౌడ్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



జీపీ కార్మికులకు బీజేపీ మద్దతు



నవతెలంగాణ -వేమనపల్లి

మండల కేంద్రంలో 33రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి చూపుతోందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజలకు సేవలు అందించారని పేర్కొన్నారు. అలాంటి కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. బీజేపీ కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బైస మల్లేష్, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు పట్టి వెంకటకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, మండల ఉపాధ్యక్షులు ఏట మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి గణపురం సంతోష్, బట్టు మల్లేష్, సంజయ్, నగేష్ పాల్గొన్నారు.

రామన్న సొంత లాభం కోసం కలెక్టరేట్ తరలింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్యే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లాభాలు పెంచుకోవడానికి కలెక్టర్ కార్యాలయాన్ని వేరే చోటికి తరలిస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆరోపించారు. సోమవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ సముదాయ భవనం పేరిట పట్టణానికి దూరంగా తరలిస్తున్నారని, ప్రస్తుతం ఉన్న భవనం ప్రజలకు అందుబాటులో ఉందని తెలిపారు. ఒకవేళ ఆ భవనం శిథిలమై ఉంటే అదే చోట నూతన భవన నిర్మాణం చేపట్టాలన్నారు. జోగు రామన్న తన రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పెంచుకోవడానికి వేరే చోటికి తరలిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకోవడానికి పట్టణం నడి ఒడ్డున స్థలం ఉంటుంది కానీ పేద ప్రజలకు, జర్నలిస్టులకు ఇవ్వడానికి ఇండ్ల స్థలాలు దొరకడం లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర సచివాలయం ఎలాగైతే పాత చోటే నిర్మించారో, అలాగే జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కూడా అదే చోట నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. నాయకులు గటిక క్రాంతి కుమార్, సంతోష్, తాటి సతీష్, మోహన్ అగర్వాల్, సబ్దార్, అశాంత్, హృతిక్ పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు : సీపీఐ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజా యుద్ధ నౌక, విప్లవ ప్రజాగాయకుడు గద్దర్ మృతి తెలంగాణకే కాకుండా యావత్ భారతదేశానికి తీరనిలోటని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం గద్దర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి గద్దర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నళినిరెడ్డి, రాములు ఉన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

తెలంగాణ ఉద్యమంలో తన గళంతో కోట్ల మందిని గద్దర్ ఉత్తేజపరిచారని, ఆయన మరణం బాధాకరమని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అట్టడుగు వర్గాలకు గొంతుకై నిలిచారని సేవలను కొనియాడారు. గద్దర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కండ్ల కలకపై వైద్య శిబిరం నిర్వహించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో విస్తరిస్తున్న కండ్ల కలకపై వైద్య శిబిరం నిర్వహించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు వెట్టి గణేష్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పిట్ట బొంగరం పిహెచ్‌సిలో వైద్యులు ప్రతాప్‌నాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ప్రస్తుతం ఏజెన్సీలో కండ్ల కలక వేగంగా వ్యాపిస్తోందని, దాని నివారణకు ఆదివాసీ గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల వద్ద కండ్ల కలక మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో తెలంగాణ ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊయిక విష్ణు ఉన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యాక్ సంస్థ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా న్యాక్ ద్వారా కుట్టు మిషన్ శిక్షణ తీసుకుంటున్న వారితో మాట్లాడారు. వారు కుట్టిన బట్టలను పరిశీలించారు. వృత్తి శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలని సూచించారు. ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట నాయకులు గన్నోజు విజయ్, పద్మగౌడ్, ముఖీమ్, శివకిరణ్ ఉన్నారు.

అక్రమ చర్చి నిర్మాణం ఆపాలి

తలమడుగు : మండలంలోని ఉమ్డం గ్రామ శివారులో మత్తడివాగు ముంపు ప్రాంతంలో అక్రమంగా నిర్మిస్తున్న చర్చ్ నిర్మాణ పనులు ఆపాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోండ్ల నారాయణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గతంలో బలహీన వర్గాలకు ఇండ్లు నిర్మించి ఇచ్చారని, మత్తడి డ్యామ్ బ్యాక్ వాటర్‌తో ముంపుకు గురైందని తెలిపారు. బాధితులకు గ్రామంలో మరోచోట పునరావాసం కల్పించారని తెలిపారు. ముంపు ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా చర్చి నిర్మిస్తున్నారని, దీన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు ఎం.గంగాధర్, డి. శారద, శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా టీయూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయం ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం సంఘ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ చారిత్రక నేపథ్యంలో ఏర్పడిన పన్నెండేళ్ళ ప్రస్థానంలో ఎన్నో పోరాటాలు చేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. సంఘ ఆవిర్భావంలో కీలక భూమిక పోషించిన నాయకుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు భీంరావ్, రామారావ్, జిల్లా కమిటీ సభ్యులు లచ్చారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రావ్, మున్క రవిందర్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సంరక్షణ- ప్రభుత్వ విద్యా పరిరక్షణకు

సమరభేరి జీపు యాత్ర

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి అనిల్



నవతెలంగాణ-ఖానాపూర్

సంక్షేమ హాస్టళ్ల సంరక్షణ, ప్రభుత్వ విద్యా పరిరక్షణకు సమరభేరి జీపు యాత్ర సోమవారం ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి బోడ అనిల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి 9సంవత్సరాలు అవుతున్నా విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారన్నారు. అద్దె భవనాలలో ప్రారంభించిన గురుకులాల్లో అసౌకర్యాల నడుమ విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. గతంలో మంత్రులు ప్రకటించిన మెస్ చార్జీల పెంపును తక్షణమే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు రావాల్సిన సుమారు 5,177కోట్ల రూపాయల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బాసర ట్రిపుల్ ఐటీలో 12 డిమాండ్స్ పరిష్కరిస్తామన్న ప్రభుత్వం నేటి వరకు ఒక్క డిమాండ్ కూడా పరిష్కరించలేదన్నారు. విద్యా హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేసి బడుగు బలహీన పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టల్‌లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి నెలకు 1200 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖానాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభిస్తామని మాటలు చెప్పడం తప్ప ఇప్పటికీ మంజూరు చేయకపోవడం ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. జాతీయ నూతన విద్యా విధానం రద్దు చేసేంతవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నవీన్, జిల్లా కార్యదర్శి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు ఉదయ్, రుద్ర ప్రతాప్, నాయకులు చరణ్, సాయిచరణ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. దీనికి టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శంకర్ మద్దతు ప్రకటించారు.

ప్రజల అవస్థలు పట్టించుకోని పాలకులు

- రహదారిపై గుంతలు పూడ్చి నిరసన తెలిపిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలో అంతర్గత రహదారులపై గుంతలు పడి ప్రజలు అవస్థలు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు కూచాడి శ్రీహరి రావు మండిపడ్డారు. స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్ నుండి బంగల్‌పేట్ వరకు గుంతలమయమైన రహదారిని నాయకులు సోమవారం పరిశీలించారు. గుంతలను మట్టితో పూడ్చి పూలను చల్లి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సామాన్య మధ్య తరగతి ప్రజల ఇండ్లను నేల మట్టం చేసి మున్సిపల్ పాలకవర్గం రోడ్డు విస్తరణ పనులు చేపట్టి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు పూర్తి చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. రోడ్డంతా అడుగు అడుగుకు ఒక గుంత ఏర్పడిందని, కేవలం తాత్కాలిక మరమ్మతులు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారని మండిపడ్డారు. గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే అవస్థలు పడుతున్నారని తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి కమీషన్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేసే పనులను వివరించారు. కార్యక్రమంలో నాయకులు అర్జుమన్ అలీ, ఎంబడి రాజేశ్వర్, పొడేల్లి గణేష్, అజహర్, చిన్ను, అతిక్ అహ్మద్, వాజీద్ అహ్మద్, మతిన్, సబాకలిం, మజహర్ అలీ, మొహిన్, ఖీసర్, గాజుల రవి కుమార్, అరవింద్, గణేష్, మార నర్సా రెడ్డి, కత్తి సురేష్, ప్రశాంత్, అజహరుద్దీన్, రాథోడ్ వెంకటేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడించిన ఆశా వర్కర్లు



నవతెలంగాణా-నిర్మల్

ఎంసీహెచ్ డ్యూటీలు రద్దు చేయాలని, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. కలెక్టరేట్‌ను సోమవారం ఆశా వర్కర్ల ముట్టడించారు. ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మెన సురేష్ మాట్లాడారు. ఆశా వర్కర్లతో విధులలో లేని పనులు చేయించకూడదన్నారు. పేపర్ జిరాక్స్ డబ్బులు చెల్లించాలన్నారు. అదనపు పనులకు టీఏ, డీఏలు చెల్లించాలన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పీహెచ్‌సీ డ్యూటీలను తొలగించాలని కోరారు. గర్భిణుల టార్గెట్ పేరుతో ఒత్తిళ్లకు గురిచేస్తూ, వేతనాల్లో కోతలు విధించడం సరికాదన్నారు. అర్హత కలిగిన ఆశా వర్కర్లకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్నవారికి రూ.5లక్షలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.గంగమణి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ చంద్రకళ, ఉపాధ్యక్షులు విజయ, భాగ్య, సుగుణ, ఇంద్రమాల, సహాయ కార్యదర్శులు సునీత, రజిత, విజయ, శోభ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు మహిళల చేరిక



ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వార్డ్ నెంబర్ 12లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ వచ్చేది ప్రతి పేదవాడు కలలుగన్న ఇందిరమ్మ సంక్షేమ రాజ్యమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి పేదవాడి మోహంలో చిరునవ్వులు చిందించడమే లక్ష్యంగా వారి అభ్యున్నతి కోసం పాటు పడుతుందని తెలిపారు. ఆదిలాబాద్ చరిత్రలోనే పలు వార్డుల్లో పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలతో సహా ఇందిరమ్మ ఇంటిని నిర్మించి ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్థలాలను పేదలకు ఇవ్వకుండా వేలం వేసి డబ్బులు కూడబెట్టుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ఐదు లక్షల రూపాయలతో నిర్మించి ఇస్తామని అన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి నాలుగు వేల రూపాయల ఆసరా పించన్లు పథకాన్ని వర్తింపజేస్తామని, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్లను అందిస్తామని, ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, ఎకరాకు రూ.10వేల రైతుబంధు అందిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు సేవలపై అవగాహన

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ మండలం బంగారుగూడలో సోమవారం ఆర్టీసీ అందిస్తున్న సేవలపై విలేజ్ బస్ ఆఫీసర్‌లు ఎం.శ్రీనివాస్, అశోక్, కె.వంశీ, జి.మోహన్ అవగాహన కల్పించారు. రాయితీ టిక్కెట్లతో పాటు, విద్యార్థి, వికలాంగుల రాయితీ పాసుల గురించి తెలియజేశారు.

ఆదివాసుల ర్యాలీ వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



రామకృష్ణాపూర్ : ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చెన్నూర్‌లో నిర్వహించే చలో చెన్నూర్ ర్యాలీ వాల్‌పోస్టర్లను సోమవారం రాజీవ్ చౌరస్తాలో చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డా. దాసారపు శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1994లో ఆదివాసీ హక్కులు సంస్కృతికి రక్షణ కల్పించాలని ఐక్యరాజ్య సమితి తీర్మానం ద్వారా ఆమోదించిందని తెలిపారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ రోజుగా ప్రకటించినప్పటికీ ఇప్పటికి కూడా ఆదివాసులు హక్కుల కోసం ప్రభుత్వంపై పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 11లక్షల ఎకరాలకుగాను 4లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుందని మండిపడ్డారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వాలు అని చెప్పుకునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పడిపోయే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మాంతయ్య, రాకేష్, సమ్మయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో మహిళా సాధికారికతపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు చెందిన సఖి కేంద్రం, మహిళా సాధికారికత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సాధికారికత విభాగంకు చెందిన యశోద, కృష్ణవేణి, కోటేశ్వర్, నిఖిలేశ్వర్‌రెడ్డి, సఖి కేంద్రం నాగమణి, సుకేషణ, కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ, అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఇన్చార్జి యశశ్రీ, విభాగాధిపతులు రాజ్‌కుమార్, వీరస్వామి, రాజన్న, సుధాకర్, రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కడ్కిని పంచాయతీగా ఏర్పాటు చేయాలని నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండలంలోని కడ్కి గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సామ రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కడ్కి గ్రామం రెవెన్యూ పరిధిలో ఉన్నప్పటికీ ఫారెస్ట్ పరిధిలో ఉన్న గణేష్‌పూర్ గ్రామంలో విలీనంతో అభివృద్ధికి నోచుకోలేని పరిస్థితిలో ఉందన్నారు. ఏదైన అభివద్ధి పనులు చేయాలంటే అటవీ చట్టాలు అడ్డుగా వస్తున్నాయని తెలిపారు. దీంతో ఏళ్ల గడుస్తున్నా గ్రామస్థుల పరిస్థితి అగమ్యగోచరంగానే ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పంచాయతీ పనుల అవసర నిమిత్తం గణేష్‌పూర్‌కు వెళ్లాలంటే కడ్కి గ్రామస్తులు సుమారు నాలుగు నుంచి ఐదు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. ఈ క్రమంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కడ్కి గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గణేష్‌పూర్‌లో కలిసి గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆత్రం ఉసేన్, టేకం అయ్యా, ఆత్రం, బురియ, కుమ్ర సోను, ఆత్రం బైరు, మడావి గణపత్, టేకం రామ్‌జీ ఉన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో నిర్వహించిన వారోత్సవాలలో ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్యవతి పాల్గొన్నారు. తల్లి పాలు శిశువులో రోగ నిరోధక శక్తిని పెంపొందింపజేస్తుందని ఆమె తెలిపారు. తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్న పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీఓ మోహన్, ఎంపీవో నసీరుద్దీన్, అంగన్వాడీ, ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కడెం: మండలంలోని నచ్చాన్ ఎల్లాపూర్ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు అంగన్వాడీ టీచర్ లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, కిషోర బాలికలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించారు. గర్భిణులు తీసుకోవల్సిన పోషకాహారం పట్ల వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రమాదేవి, ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ ప్రతాప్‌సింగ్, అంగన్వాడీ టీచర్ సుమలత, ఆశా వర్కర్ గోదావరి, గర్భిణులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు వాల్‌పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద చలో ఇందిరా పార్క్ పోస్టర్లను తెలంగాణ ఉద్యమకారులు విడుదల చేశారు. ముందుగా ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి పట్ల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మాట్లాడారు. 20న ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మ గౌరవ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులు పార్టీలు, సంఘాల రహితంగా ఏకమై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం, సామాజిక, ప్రజాస్వామిక సంపూర్ణ తెలంగాణ కోసం కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ కన్వీనర్ సామ కిరణ్‌రెడ్డి, మండల ఉద్యమ నాయకులు బొల్లోజి నర్సయ్య, సామల వీరయ్య, శేఖర్‌గౌడ్, భూమన్న, నరేందర్‌రావు, విలాస్‌రావ్, పోతారెడ్డి, లక్ష్మణ్, రాజేందర్ పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈఓ



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉండాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నారాయణ, స్కూల్ కాంప్లెక్స్ నోడల్ అధికారి రాజా శంకర్, సెక్టోరియల్ అధికారి నారాయణ, తలమడుగు కాంప్లెక్స్ హెడ్మాస్టర్ వై.వినోద్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్లు, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌ను ప్రారంభించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నూతనంగా మంజూరు చేసిన 108 అంబులెన్స్‌ను మవాల జడ్పీటీసీ నల్ల వనిత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు విద్యా, వైద్యం అందుబాటులో ఉండేవిధంగా అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అత్యవసర సమయంలో ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించేందుకు 108 వాహనాలు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. 108 వాహనాల మూలంగా ఎందరో మంది ప్రాణాలు కాపాడబడ్డాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఎక్కడాలేని విధంగా అనేక సంక్షేమ పథకాల అమలులో ముందుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్, అజీమ్‌ఖాన్, గ్రామ కార్యదర్శి మహేందర్, 108 సిబ్బంది పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

వైద్యం చేయాలంటే వాగు దాటాల్సిందే

నవతెలంగాణ-సిరికొండ



మండలంలో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల వల్ల వాగులు వంకలు నిండి ప్రవహిస్తున్నాయి. గ్రామాలకు వెళ్లాలంటే వాగులు, వంకలు దాటి వెళ్లాల్సిందే. సోమవారం మండలంలోని కన్నపూర్ తండాలో వైద్య సిబ్బంది వాగు దాటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ జలెందర్, హెల్త్ అసిస్టెంట్ విజయ్, సిబ్బంది నిర్మల, విజయ రంజని పాల్గొన్నారు.

గిరిజన శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుభీర్

ముథోల్ నియోజకవర్గంలో ఉన్న గిరిజనులకు గిరి వికాస్ ద్వారా బోరు మోటార్లు, వాటికి అవసరమైన కరెంట్ సౌకర్యం కల్పించాలని సోమవారం బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గిరిజన, లంబాడా, నాయక్‌పోడ్‌లకు గిరి వికాస్ యూనిట్లు మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ శంకర్‌చవాన్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన జాదవ్ గణేష్ ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు సోమవారం 2001, 2002 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు కలిసి రూ.12వేలు అందించి ఉదారత చాటుకున్నారు. ముందుగా కుటుంబ సభ్యులకు ఓదార్చారు. ఆసరా లేని వారి కుటుంబానికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఆదుకోవాల్సిన అవసరముందని వైస్ ఎంపిపి చంద్రశేఖర్ జాదవ్ అన్నారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో గ్రామ పెద్దలు జాదవ్ రమేష్, జాదవ్ ఉమాజీ, ఛత్రపతి శివాజీ మహారాజ్ యూత్ సభ్యులు రవీందర్ ఫడ్, రాథోడ్ రాజు, చౌహాన్ తుకారాం ఉన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజు సెలవు ప్రకటించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఈ నెల 9న జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవు ప్రకటించాలని రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందూరు ప్రభాకర్, రాయి సెంటర్ జిల్లా మేడి దుర్గు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 9న జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని స్థానిక కొమురం భీం ప్రాంగణంలోని పీఎంఆర్సి భవనంలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 9 ఆదివాసీ తెగలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు రాయి సెంటర్ల సార్ మేడిలు, దేవరీలు, ఆదివాసీ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మంగం విషంరావు, ఆనంద్‌రావు, శ్రీరామ్, ఆడ షేకు, ఆత్రం నాగోరావు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా రమేష్



నవతెలంగాణ-బోథ్

సొనాల మండల కేంద్రానికి చెందిన బత్తుల రమేష్ కాంగ్రెస్ యూత్ మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివ రాథోడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ కోసం అహర్నిశలు కష్టపడుతూ పార్టీ బలోపేతానికి తోడ్పడతానన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టినందుకు రాష్ట్ర అధ్యక్షులు శివసేనరెడ్డి, ఉపాధ్యక్షులు శివ రాథోడ్, జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్, ఆడే గజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ భూపెల్లి, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటికి ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా అభివృద్ధికి సహకరించండి

నవతెలంగాణ-ఉట్నూర్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి సహకరించాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్యాభివృద్ధితో పాటు ఆదివాసీ గిరిజన గ్రామల్లో మౌలిక సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘురాం, రాష్ట్ర నాయకులు విజయ్, సతీష్ ఉన్నారు.

గద్దర్ మరణం ప్రజానీకానికి తీరని లోటు



నవతెలంగాణ-ఉట్నూర్

తన ఆటపాటలతో చైతన్య పరిచిన గద్దర్ మరణం ప్రజానీకానికి తీరని లోటని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేతావత్ రాందాస్, ప్రజా సంఘాల జేఏసీ నాయకుడు రామారావు అన్నారు. గద్దర్ మృతి పట్ల ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో సంతాపం తెలిపి నివాళి అర్పించారు. మండలంలోని ఎస్ఆర్ నగర్ కాలనీలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో గొంతెత్తి తన ఆటపాటలతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారని కొనియాడారు. ప్రజా ఉద్యమంలో గద్దర్ లేని లోటును ఎవరూ తీర్చలేరన్నారు.

కడెం : తెలంగాణ స్వరాష్ట్ర సాధనకు ఎనలేని కృషి చేసిన ఉద్యమ నాయకుడు గద్దర్ సేవలు రాష్ట్ర ప్రజలు మరువలేనివని కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు గద్దర్ చిటపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు వాజీద్‌ఖాన్, భూషణం, షేక్ రఫిక్, బ్రహ్మచారి, రమేష్, చాంద్ పాషా పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్‌లో ప్రభుత్వం నిర్మించి పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సోమవారం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ మాట్లాడుతూ ఖానాపూర్‌లో ఇల్లు లేని నిరుపేదలు వందలాది మంది ఇంకా ఉన్నారన్నారు. ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను కొంతమంది ధనవంతులకు కూడా ఇచ్చారని అన్నారు. ధనవంతులుగా ఉన్నవారిని ఈ జాబితా నుండి తొలగించి ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని పేదలకు పక్కనే ఉన్న భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు ఇవ్వాలని అన్నారు. 110 ఎకరాల భూమి కొనుగోలు చేసిన ప్రభుత్వం దాదాపు సగం భూమిని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం పంపిణీ చేసిందని తెలిపారు. 400 ఇండ్లు నిర్మించారని, మిగతా భూమి ఖాళీగా ఉందని, ఖాళీగా ఉన్న భూమిని ఇంటి జాగలేని నిరుపేదలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా కమిటీ కార్యదర్శి డాకూర్ తిరుపతి, ఖానాపూర్ మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు, సీనియర్ నాయకులు ఆకొండపేట గ్రామ సర్పంచ్ దుర్గం పోశలింగం, ఖానాపూర్ పట్టణ కన్వీనర్ వర్మ పాల్గొన్నారు.

సివిల్ ఎస్ఐగా ఎంపికైన సుష్మితకు సన్మానం



నవతెలంగాణ-కుభీర్

సివిల్ ఎస్ఐగా ఎంపికైన మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన జాడే సుష్మితను సోమవారం ఆనందిత ఫౌండేషన చైర్మన్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2018లో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చిందని, దానితో ఆగకుండా ఎస్ఐ ఉద్యోగం కోసం ప్రయత్నించి సాధించడంతో చాలా ఆనందంగా ఉందని తెలిపారు. పట్టుదలతో చదివితే ఏదైనా సాధించొచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆనందిత ఫౌండేషన్ ప్రతినిధులు లక్ష్మణ్, విజయ్, సైబరావు, గౌతమ్, సురేష్ తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9న ఆదివాసీ దినోత్సవం

నవతెలంగాణ-నార్నూర్

ఈ నెల 9న ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో నిర్వహించనున్న ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పెందూర్ దాదేరావ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ నాయకులతో కలిసి మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల 9తెగల కుల సంఘ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, సార్మేడి పటేల్‌లు, ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా రావాలన్నారు. ప్రపంచంలోనే ఆదివాసులను ములవాసులుగా ఐక్యరాజసమితి పేర్కొంటూ 1994లో ఆగస్టు 9న ప్రపంచం అదివాసీ దినోత్సవంగా గుర్తించబడిందన్నారు.

ముందస్తుగా గర్భిణులను రిమ్స్‌కు తరలింపు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మారుమూల గ్రామం, రోడ్డు సౌకర్యం లేదు, ఏదైన సమాచారం అందించాలన్న మొబైల్‌కు నెట్వర్క్ ఉందు..అటువంటి గ్రామాలలో ఉన్న గర్భిణులను గుర్తించి డెలివరీ సమయం పక్షం రోజులు ఉండగానే వైద్య అధికారులు రిమ్స్‌కు తరలిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని మోహదా గ్రామానికి చెందిన గర్భిణీని డెలివరీ కోసం ముందస్తుగా రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి భీంరావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి సౌకర్యాలు లేని గ్రామాల్లో ఉన్న గర్భిణులను గుర్తించి డెలివరీకి పక్షం రోజులు ముందస్తుగా రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పిప్పిరి పల్లె దవాఖానా సిహెచ్‌ఓ ప్రశాంత్, హెల్త్ సూపర్‌వైజర్ దేవిదాస్, హెల్త్ అసిస్టెంట్ రమేష్, వైద్య సిబ్బంది సంగీత, నీరజ, ఆశా గంగమణి పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

ఆగస్టు 10లోపు గృహలక్ష్మి పథకం కింద అర్హులైన లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవాలని డీసీఓ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలు, సొంత స్థలం ఉన్నవారికి ఇండ్లు కట్టుకునేందుకు రూ .3లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు గృహలక్ష్మి పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. దరఖాస్తు చేసుకొనేవారు ఇల్లులేని, సొంత స్థలం ఉన్నవారు 10లోగా ఎంపీడీఓ, మున్సిపాలిటీ, కలెక్టర్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తుతో పాటు రేషన్‌కార్డ్, ఆధార్ కార్డ్ అందజేయాలని తెలిపారు. తప్పనిసరిగా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని తెలిపారు.

108లో మహిళ ప్రసవం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని చిమ్మన్‌గుడి గ్రామానికి చెందిన విజయ పురిటి నొప్పులతో బాధపడుతూ 108కి సమాచారం అందజేశారు. దీంతో అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, వారిని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు ఈఎంటి సురేష్, పైలట్ వినోద్ తెలిపారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సిరికొండ

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు యాదవ్‌రావ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివాసీలంతా కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 9న మండల కేంద్రంలో నిర్వహించే ఆదివాసీ దినోత్సవానికి మండలంలోని 9తెగల ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు, రాయిసెంటర్ సార్మెడిలు, సర్పంచులు, వివిధ గ్రామాల పటెళ్లు, దేవరిలు, మహాజన్‌లు, వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాడిన పాటలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్ రావ్, ఆదివాసీ సంఘాల నాయకులు రఘురాం, పాండు, మహాదు, అనిల్ పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనుస్సు వ్యాధి నిరోధక టీకాలు

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మిషన్ ఇంద్ర ధనస్సు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. అర్లి, ధనోర హెల్త్ వెల్నెస్ సెంటర్లను జిల్లా మాతాశిశు సంరక్షణ అధికారి డా.విజయసారథి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాధినిరోధక టీకాల తీసుకోని గర్భిణులకు, శిశువులకు, పిల్లలకు ప్రత్యేక మిషన్ ఇంద్ర ధనుస్సు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో వేసుకునే విధంగా తెలియజెప్పాలన్నారు. ఆశా కార్యకర్తలు దీనిపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. నిఖిల్‌రాజ్, ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు లూసి, ఆరోగ్య కార్యకర్తలు నఫీజ, విష్ణుకుమార్, ఆశా కార్యకర్తలు సాజిద, కవిత, అనుసూయ, రామ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గుంజల, కొత్తపల్లి సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాల గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పిహెచ్‌సి వైద్యుడు రాంబాబు పేర్కొన్నారు. మొత్తం 88 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. వైద్య పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో హెల్త్ సూపర్వైజర్ చౌహన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది హిమబిందు, రవీందర్, నగేష్, కవిత, సురేష్, రాజమణి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో 9న ఫొటో ఎగ్జిబిషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాలలో ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలపై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రదర్శన ఉదయం 11:30 గంటలకు ప్రారంభమై రోజంతా ఉంటుందన్నారు. ఆదివాసీలు, ప్రజలు, విద్యార్థులు, పట్టణ ప్రజలు, కవులు, కళాకారులు, ఉద్యోగులు ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని కోరారు. ఫొటోగ్రఫీలో సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

విద్యాశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోథ్



నియోజకవర్గంలోని ఇచ్చోడ మండల కేంద్రంలోని జనరల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినందుకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బోథ్ మండల కేంద్రంలో కూడా జనరల్ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరారు.

సామల సదాశివకు నివాళి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సామల సదాశివ్ మాస్టర్ 11వ వర్ధంతి సందర్భంగా పద్మశాలి కులస్తులు నివాళ్ల అర్పించారు. జిల్లా కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ చౌక్‌లో సోమవారం సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ సామల రాజవర్ధన్‌తో పాటు పలువురు సదాశివ్ మాస్టర్ చిత్రపటానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు రమేష్, పోపా అధ్యక్షుడు బేత రమేష్, బాస దత్తు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కుర్ర నరేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్, ఎస్ఐని కలిసిన తుడుందెబ్బ నాయకులు



నవతెలంగాణ-తలమడుగు

కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రాజమోహన్, ఎస్సై ధనశ్రీని సోమవారం తుడుందెబ్బ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ అధ్యక్షులు మనోహర్, ప్రధాన కార్యదర్శి పొచ్చన్న, జ్ఞానేశ్వర్, భుజంగరావు, అశోక్, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



నవతెలంగాణ-సిరికొండ

ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను మండల బిఆర్ఎస్, తుడుందెబ్బ నాయకులు సోమవారం శాలువాలు కప్పి సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్ఐ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్‌రావ్, బీఆర్ఎస్, తుడుందెబ్బ నాయకులు ఇక్బాల్, చందు, రఘురాం, యాదవ్‌రావ్, పాండు, అమృత్‌రావ్, రాజారాం, లక్ష్మణ్, పోశెట్టి, లచ్చు, మహదు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

రైతులకు రుణమాఫీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తంతోలి గ్రామంలో రైతులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. రైతు సంక్షేమాన్ని కోరే ప్రభుత్వాలు ఉన్నప్పుడే రైతు రాజ్యం వస్తుందని విశ్వసిస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమ్ర రాజు. సెవ్వ జగదీష్ యాదవ్, మల్లేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

8న మంగళవారం 33కెవి బేల ఫీడర్ నిర్మాణ పని కారణంగా పక్కన గల బంగారిగూడ ఫీడర్ లైన్ నిలిపివేయడం జరుగుతుందని, దీనివల్ల పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తిరుపతిరెడ్డి తెలిపారు. బంగారిగూడ, పిప్పల్‌ధరి, అంకోలి, సాత్నాల సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంగ్లీష్ మీడియంలో బోధించడానికి అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చినప్పరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటని, జువాలజి సబ్జెక్టులో బోధించడానికి అర్హులైన అభ్యర్థులు రెండు రోజుల్లో ఆదర్శ పాఠశాలలో పీజీ, బిఈడీ అన్ని ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 11న డెమో నిర్వహిస్తామన్నారు. మెరిట్‌తో పాటు డెమో ఆధారంగా సెలెక్ట్ చేస్తామని తెలిపారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

నవతెలంగాణ-వాంకిడి



ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల, మైనార్టీ సీనియర్ సిటిజన్స్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మండలకేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్, బాబు జగ్జీవన్‌రావు భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సర్పంచ్ సెండె తుకారాం, ఎంపీటీసీ పీతాంబర్, సందీప్, దీపక్, శ్యాంరావు, రాజేశ్వర్, జైపాల్, మహేష్ ఉన్నారు.

భారమవుతున్న చేనేత బతుకులు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



మానవాళికి వస్త్రాన్ని అందించి నాగరికతను నేర్పిన చేనేత బతుకు బరువుతున్నాయని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యాయవాది రాజలింగు మోతె అన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని చేనేత వస్త్రాలయం వద్ద ఆయన మాట్లాడారు. మగ్గం చేనేతల కడుపు నింపడం లేదన్నారు. ఇమిడే చీరలు నేసి ప్రపంచానికి చేనేత కళ వైభవాన్ని చాటి చెప్పిన నేతన్నలు అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారని అన్నారు. చేనేత స్థానంలో మర మగ్గాలు, ఆధునిక మగ్గాలు వచ్చినా వారి జీవితాలు చక్రబంధంలో ఉన్నాయన్నారు. నేతన్నల జీవితాలు బాగుపడాలంటే, ప్రభుత్వం వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, సబ్సిడీపై మగ్గాలను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని మల్కాపల్లి ధర్మరావుపేట గ్రామాల మధ్యలో ఉన్న వాగుపై బ్రిడ్జి లేక వర్షాకాలంలో స్థానిక ప్రజలు, స్కూల్ విద్యార్థులు, రైతులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ నాయకులు గ్రామాలను, వాగును పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. స్కూల్ విద్యార్థులు తిరిగి వెళ్లాలంటే ఆటో చార్జీలు ఎక్కువ అవుతుందని, దీని వల్ల స్కూల్ విద్యార్థులకు దూరభారం అవుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య రెండవసారి ఎమ్మెల్యే గెలిచి కూడా కాసిపేట మండలంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, కాని కాలేశ్వరం ప్రాజెక్ట్ 30 కోట్లతో అయ్యేది రీ డిజైన్ పేరుతో లక్ష కోట్లు చేసి కమీశన్ల కోసం కక్కుతి పడ్డారని విమర్శించారు. ఇలాంటి చిన్న బ్రిడ్జిలు నిర్మించలేకపోతున్నారన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడి చేస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల ఇన్‌ఛార్జి అట్కపురం రమేష్, పడిగాల మహేందర్, పడిగల లింగయ్య కోడూరి తిరుపతి, పడిగల బానేష్, సాగర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పద్మశాలి యుద్ధభేరికి అధిక సంఖ్యలో తరలి రావాలి



నవతెలంగాణ-జన్నారం

రాజ్యాధికారమే లక్ష్యంగా కోరుట్లలో నిర్వహించే పద్మశాలి యుద్ధభేరి సభకు అధిక సంఖ్యలో తరళిరావాలని పద్మశాలి సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, వెంకటేశం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. ఆగస్టు 13 ఆదివారం, 12 గంటలకు కోరుట్ల పట్టణంలో ఈ పద్మశాలి యుద్ధభేరి సభ ఉంటుందన్నారు. పద్మశాలిలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలంటే ఐకమత్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆడెపు లక్ష్మీనారాయణ, దోమల భాస్కర్, అయ్యోరి రవీందర్, దూష పరశురాం, వోడ్నాల రమేష్, చంద్రయ్య, అంజన్న, చిందం లచ్చన్న, మల్లేష్, చందు, నరేందర్, బొద్దుల అంజన్న, రాయమల్లు, మార్కండేయ వెంకటేష్, కందుల రమేష్, రవి పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

కలెక్టర్ ఆదేశాల మేరకు గృహలక్ష్మి దరఖాస్తులను ఈ నెల 10వ తేదీ వరకు స్వీకరించనున్నట్టు ఎంపీడీఓ గంగాసింగ్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 10 తేదీ వరకు దరఖాస్తు దారులు దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డు, ఇంకమ్ సర్టిఫికేట్, కాస్ట్ సర్టిఫికేట్, బ్యాంకు ఖాతా, భూమి యొక్క పత్రాలు దరఖాస్తు ఫారంతో జతపరిచి ఎంపీడీఓ కార్యాలయంలో ఇవ్వాలని ఆయన తెలిపారు.

ఆదివాసీ దినోత్సవానికి తరలిరావాలి



నవతెలంగాణ-జన్నారం

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి అధిక సంఖ్యలో ఆదివాసులు తరలి రావాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు రాయి సీడం కాలీ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులను కాపాడుకోవడానికి ఐకమత్యంగా ఉండి పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి దువ్వెంత ధర్మ, మహిళా కార్యదర్శి మర్సకోల సుశీల, మండల కోశాధికారి తొడసం జంగు, మేస్త్రం సుదర్శన్, యశ్వంతరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-చింతలమానేపల్లి

నూతనంగా కామరెడ్డి నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దార్ బి.నాగరాజు గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ముస్కుర్ అలి, కౌటాల డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

మణిపూర్ దమనకాండ దారుణం

నవతెలంగాణ-జన్నారం

క్రైస్తవులపై, దళితులపై మణిపూర్లో జరుగుతున్న దమనకాండ దారుణమని ప్రభుత్వం స్పందించి వెంటనే ఆ ధమన కాండను ఆపాలని సోమవారం మండల కేంద్రంలో వివిధ చర్చలకు చెందిన పాస్టర్లు, కాంగ్రెస్, సీపీఐ(ఎం), వైయస్సార్ తెలంగాణ పార్టీ, ఇతర సంఘాలకు చెందిన నాయకులతో శాంతియుతంగా భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సీఎస్ఐ చర్చి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ మణిపూర్ దళితులపై క్రిస్టియన్లపై ఇతర జాతులపై దాడులు చేయడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి, ఆ నిందితులను పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ సంతోష్ రాజ్, అభిషేక్, జీవన్, సుభాష్, షాలేము, ప్రవీణ్, దావీదు, యువకులు మంద రాజేష్, రాము, స్వామి, ఏబిసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ వినోద్ నాయక్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్ జిల్లా నాయకులు



కూకట్కారి బుచ్చయ్య, వైయస్సార్ తెలంగాణ పార్టీ మండల అధ్యక్షులు, పురుషోత్తం ఐద్వా మండల అధ్యక్షురాలు పోతు విజయశంకర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల రాస్తారోకో



నవతెలంగాణ-దండేపల్లి

పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం దండేపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. వారికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మద్దతు తెలిపారు. గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నాటి నుండి గ్రామపంచాయతీ కార్మికులు 11వ పీఆర్సీని వర్తింపజేయాలని పోరాటాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నిరత్తినట్లు వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 48 తీసుకువచ్చి పాఠశాలలను ప్రభుత్వ కార్యాలయం పరిశుభ్రంగా ఉంచాలని అదనపు పని భారాన్ని మోపింది తప్ప వేతనాలు చెల్లించడంలో సమస్యలు పరిష్కరించడం లేదని మండిపడ్డారు. జీఓ నెంబర్ 51 ద్వారా కార్మికుల పని భద్రత దూరం చేసి మల్టీపర్పస్ వర్కర్స్‌గా పనిచేసే భారాన్ని మోపిందని అన్నారు. కార్మికులకు రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్న అమలుకు నోచుకోలేదని ఆగ్రాహం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో చొరవ తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజలింగు, బానేష్ నాయకులు సాయి కృష్ణ, శంకర్, సాగర్, లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి

నవతెలంగాణ-జన్నారం

ప్రజా గాయకుడు యుద్ధ నౌక గద్దర్ అకాల మరణానికి చింతిస్తూ సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద, అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు సిటిమల భరత్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏనుగు సుభాష్ రెడ్డిలు మాట్లాడుతూ దళిత పీడిత వర్గాల పక్షాన పోరాటం చేస్తూ ప్రజలను చైతన్య పరిచే పాటలను పాడుతూ ప్రజల మధ్యనే ఉండే గద్దర్ అకాల మరణం చెందడం యావత్ తెలంగాణ ప్రజలకు తీరని లోటన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అతని ఆటపాటలతో తెలంగాణ ప్రజలను జాగృతపరిచి, తెలంగాణ సిద్ధించడానికి ఎంగానో కృషి చేశారన్నారు. అలాంటి మహానీయుడు మరణించడం బాధాకరమన్నారు. అతని అకాల మరణం పట్ల వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు బోర్లాకుంట ప్రభుదాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిపల్లి ఇందయ్య, నేతకాని సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, నాయకులు జనుగూరు మల్లయ్య, దుమల్ల ప్రశాంత్, మండల కోఆప్షన్ సభ్యుడు మునవార్‌అలీ ఖాన్ పాల్గొన్నారు.

దండేపల్లి : యుద్ధనౌక ప్రజా గాయకుడు గద్దర్ మృతికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి ప్రజలను చైతన్య పరచడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు అభిప్రాయం వ్యక్తం



జన్నారం

చేశారు. గద్దర్ మరణం తెలంగాణకు తీరనిలోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

దహెగాం : మండలకేంద్రంలో సోమవారం ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజాల రాజాబాబు మాట్లాడుతూ కవిగా, విప్లవకారుడిగా, ఉద్యకారుడిగా, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలతో పాటు అనేక ప్రజా వ్యతిరేక పోరాటాలను తనదైన గొంతులో పాట రూపంలో వినిపించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గద్దర్ లేని లోటు తీర్చలేదని కొనియాడారు. కార్యక్రమంలో కళాకారులు సుంకరి బాపు, పందిర్ల మల్లేష్, దుర్గం దేవాజీ, వంబాల తిరుపతితో పాటు స్థానిక నాయకులు పుప్పాల సంతోష్ పాల్గొన్నారు.



దండేపల్లి



దహెగాం

తల్లిపాల ఆవశ్యకతను వివరించాలి



పెంచికల్‌పేట్

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

తల్లిపాల ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలకు వివరించాలని డీడబ్ల్యూఓ సావిత్రి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని రైతువేదికలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని అంగన్‌వాడీల ఆధ్వర్యంలో గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసాలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరిత మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తర్వాత ముర్రుపాలు తాగించాలని, పోషకాహారం తీసుకోవాలని, ప్రభుత్వం అందించే న్యూట్రేషన్ కిట్లను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గణపురం కావ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జన్నారం : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఇందన్‌పెల్లి సర్పంచ్ కంటెం సునీత శంకర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. సోమవారం మండలంలోని ఇంధన్‌పల్లి అంగన్‌వాడీ-2 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కారమన్నారు. ముర్రుపాలు తాగించడం వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరిగి శారీరకంగా మానసికంగా దృఢంగా ఎదుగుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాగే శ్రీవాణి, అంగన్వాడీ టీచర్లు రమా బుచ్చమ్మ, ముని బేగం పాల్గొన్నారు.

మందమర్రి : తల్లి పాలతోనే శిశువుకి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీసీ మందమర్రి సెక్టార్ సూపర్‌వైజర్ ఏ సంధ్యారాణి అన్నారు. సోమవారం మందమర్రి పట్టణం ప్రాణహిత కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణీ స్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తల్లిలో పాలు పెరుగుదలకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌బి రాజశ్రీ, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, పద్మ, ఆశా వర్కర్ రాధా పాల్గొన్నారు.

దహెగాం : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఎంపీపీ కంబగోని సులోచన అన్నారు. సోమవారం మండలంలోని చిన్నరాస్పెల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలు తాగించాలని అన్నారు. ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలకు అనేక రకాల పోషకాలు అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



మందమర్రి



దహెగాం

ఆదివాసీ దినోత్సవ కరపత్రాల విడుదల



నవతెలంగాణ-దండేపల్లి

దండేపల్లి జిల్లా కేంద్రంలోని హరిత ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం తహసీల్దార్ సంధ్యారాణి, ఆదివాసీ సేవ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సంధర్భంగా గోండ్వానా రాయిసెంటర్ జిల్లా నాయకులు మాట్లాడుతూ దినోత్సవానికి ఆదివాసులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. 9న గుత్తికోయ, గోండ్, కొలాం, పర్ధాన్, తోటి, నాయకపోడ్, ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలతో, ఆటపాటలతో వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దండేపల్లిలో జెండా ఆవిష్కరణ ఉంటుందని అన్నారు. అనంతరం జిల్లా కేంద్రానికి ఆదివాసీ తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేవ సంఘం నాయకులు సిడాం దాము పటేల్, ఆత్రం జలపతి, మంగు, తిరుపతి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- అడిషనల్ డీఆర్‌డీఓ కుటుంబరావు



నవతెలంగాణ-దహెగాం

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీఓ కుటుంబరావు అన్నారు. సోమవారం మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ భారత్ మిషన్ పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా కూడా బావుల వద్ద, బోరు బావుల వద్ద, ఇండ్లలో నుండి మురికినీరు బయటకు వెళ్లకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకుంటే భూగర్భ జలాలలు పెరగడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రం కాకుండా ఉంటాయన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వహించకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, ఏపీఓ కల్పన, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ ఉన్నారు.

దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో చెక్‌పోస్టు వద్ద సోమవారం అక్రమంగా తరళిస్తున్న దేశీదారు బాటిల్లను పోలీసులు పట్టుకున్నారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా ఎల్బూర్‌వార్ కొమురయ్య అనే వ్యక్తి వద్ద 30 దేశీదారు బాటిల్లు పట్టుకున్నట్టు ఎస్సై సాగర్ తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని సీజ్ చేసి మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన ఎల్బూర్‌వార్ కొమురయ్యపై కేసు నమోదుచేసినట్టు తెలిపారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని పోతెపెల్లి గ్రామంలో గత నెల 30న ఆదివాసీ కొలావార్ తెగకు చెందిన కులదేవత లక్ష్మీదేవార విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని కొలావార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్మీదేవార విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు కాల్చి ధ్వంసం చేసి ఆదివాసీ సమాజాన్ని, సంస్కృతిని అవమాన పరిచారని, విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వారిని శిక్షించాలని అన్నారు. విగ్రహాలు ధ్వంసమైనందున ప్రభుత్వం నుండి రూ.మూడు లక్షల నష్టపరిహారం చెల్లించాలని మండల రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొలావార్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుర్స రంగయ్య, జిల్లా యువజన అధ్యక్షుడు వెంకటేశ్, మండల అధ్యక్షుడు పసులె సత్తయ్య, ఉపాధ్యక్షుడు టేకం శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

రేపు 'హలో ఆదివాసీ చలో చెన్నూర్'ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-చెన్నూర్

ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్‌తో ఆగస్టు 9వ తేదిన నిర్వహించే హలో ఆదివాసీ చలో చెన్నూర్ మహా సభను విజయవంతం చేయాలని ఆదివాసీ కార్యచరణ కమిటీ కన్వీనర్ చెండక మాంతయ్య పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఆదివాసి కార్యచరణ కమిటీ కన్వీనర్ చెండక మాంతయ్య ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవంను పురస్కరించుకొని కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నూర్ పట్టణంలోని షాదిఖానా (మైనారిటీ ఫంక్షన్ హాల్)లో నిర్వహించే సభను నియోజకవర్గంలోని ఆదివాసీలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. 1982లో ఐక్యరాజ్య సమితి ఆదివాసీలకు ఒక ప్రత్యేకమైన రోజు ఉండాలని ఆగష్టు 9వ తేదిని ప్రపంచ ఆదివాసి దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం అధికారికంగా నిర్వహించకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ఆగష్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు దుగ్నే జయిలు, బోయిని నగేష్, పెద్దల వెంకటేష్, బిస్కుల లక్ష్మణ్, బండి రమేష్, మేకల మహేందర్, పెద్ది సమ్మయ్య, మేకల రాంచందర్, సిద్ధం శేఖర్ నాయకులు పాల్గొన్నారు.

గద్దర్‌కు పలు సంఘాల ఆధ్వర్యంలో నివాళి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రజా గాయకుడు తెలంగాణ పాట వాహన నౌక గద్దర్ మరణించిన నేపథ్యంలో ఆయన మతికి జిల్లాలోని పలు సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళ్లు అర్పించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు సమ్మె చేస్తున్న శిబిరం వద్ద గద్దర్ కు ఘన నివాళ్లు అర్పించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆధ్వర్యంలో రెండవ ఏఎన్ఎంలు గద్దరకు నివాళ్లు అర్పించారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో రూప్నర్ రమేష్ ఆధ్వర్యంలో నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాగేశ్వర్ బోయిరే, సిడం కైలాస్, దుర్గ మహేశ్వర్, కోరింగ సంతోష్, ఎస్కే తహర్, రమేష్, దుర్గ ప్రసాద్, శ్రీనివాస్, గణేష్, యమునా పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు జీవన శైలిలో మార్పులు రావాలి

• ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్ శిల్ప

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆరోగ్య పరిరక్షణకు ప్రజల జీవన శైలిలో మార్పులు రావాలని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్ శిల్ప అన్నారు. జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో తమిళనాడు ఎంజీఆర్ యూనివర్సిటీ పీజీ డిప్లమా ఇన్ హెల్త్ ఎడ్యుకేషన్ శిక్షకురాలు లలిత అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రజల జీవనశైలి విధానము మారాలని ఫాస్ట్ ఫుడ్, నిలువ ఉంచిన పచ్చళ్ళు వంటివి తినడం తగ్గించుకోవాలని ప్రతి రోజు నడక యోగ, లాంటివి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మాస్ మీడియా అధికారి ఎండి రషీద్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలను, మీడియాను అనుమతించాలి

• ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సన్నీ గౌడ్

నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థి సంఘాలను, మీడియాను ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి అనుమతించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కనికుంట్ల సన్నీ గౌడ్ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలను, మీడియాను ప్రభుత్వ విద్యా సంస్థల్లోకి రావద్దని ఆదేశాలు జారీ చేసిన విద్యా శాఖ డైరెక్టర్ దేవసేన వ్యాఖ్యలకి నిరసనగా సోమవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించి, ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కనుకుంట్ల సన్ని గౌడ్, జిల్లా నాయకులు సిద్దార్థ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాల్లోని ప్రభుత్వా విద్యాసంస్థల్లో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పెండింగ్ స్కాలర్ షిప్స్ విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలని, మీడియాను, స్వచ్ఛంద సంస్థలను రానివ్వొద్దని ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన వ్యాఖ్యలని ఖండించారు. వెంటనే ఆ వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎస్కే కుతుబ్, మండల నాయకులు హరీష్, నవీన్, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

• జిల్లా జడ్జి ఎంవీ రమేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి ఎంవీ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినుల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. దీనితోపాటు ఏ అవసరం పడ్డ ఉచిత న్యాయ సేవలు లభించేలా కోర్టులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాలలో ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. చట్టరీత్యా ర్యాగింగ్ నేరమన్నారు. విద్యార్థులకు రాజ్యాంగం కల్పించే చట్టాలను ఉపయోగించుకోవడంతో పాటు విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అన్యాయంపై పోరాటం చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. ఎటువంటి ఫిర్యాదు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలు కోర్చి చదివిపిస్తారని వారి కష్టాలను గుర్తించి ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పూదరి మనోహర్, లీగల్ అసిస్టెంట్ అంజనీదేవి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల గ్రంథాలయానికి పాఠ్యపుస్తకాలు అందజేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

స్వర్మ ఫౌండేషన్, సిర్పూరు పేపర్ మిల్లు ఆధ్వర్యంలో సోమవారం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని గ్రంథాలయానికి రూ. లక్ష విలువైన పాఠ్యపుస్తకాలను అందించారు. మిల్లు వైస్ ప్రెసిడెంట్ ఎకె మిశ్రా, జీఎం ఎంఎస్ గిరి కళాశాల గ్రంథాలయాధికారి తూడూరు దత్తాత్రేయకు ఈ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీఎం వైస్ ప్రెసిడెంట్ ఎకె మిశ్రా మాట్లాడుతూ గమ్యం చేరాలనే పట్టుదలతో చదివితే విద్యార్థులు విజయం సాధించడం సులువని అన్నారు. జీఎం ఎంఎస్ గిరి మాట్లాడుతూ భవిష్యత్తులో కళాశాల విద్యార్థులకు మిల్లులో ఉద్యోగావకాశాలను కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.లక్ష్మీనరసింహం, మిల్లు ప్రతినిధి తుమ్మ రమేష్, లెక్చరర్లు డి.జనార్ధన్, ఎం.రాజేశ్వర్ పాల్గొన్నారు.

కళాశాలలో బోర్డు ఆదేశాలు తప్పక పాటించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ బోర్డు ఆదేశాలను తప్పక పాటించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ అన్నారు. సోమవారం స్థానిక కళాశాలల్లో తనిఖీ నిర్వహించి అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు అడ్మిషన్లకు టీసీ తప్పనిసరని, నియమ నిబంధనలు పాటించాని కళాశాలలపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందిన వారికి ఇంగ్లీష్ ప్రాక్టికల్ అభ్యసన తరగతులు నిర్వహించాలని సూచించారు. కళాశాలల్లో రోజువారీ హాజరు, అంతర్గత పరీక్షలు, ప్రమాణాల పెంపు తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి కృషి చేయాలని అన్నారు. డీఐఈఓ పర్యటనలో కార్యాలయ సిబ్బంది ఇబ్రహీం, కమల పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

2023-25 మద్యం పాలసీకి సంబంధించి నోటిఫికేషన్ వెలువడినందున కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ మంగమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగజ్‌నగర్ స్టేషన్ పరిధిలో 16 మద్యం దుకాణాలు ఉండగా, పట్టణంలోని రైల్వే ఓవర్‌బ్రిడ్జి కింద దుకాణాన్ని (గెజిట్ నెం.15) గౌడ కులస్థులకు కేటాయించగా, ఎస్సీలకు కౌటాల మండలకేంద్రంలో (గెజిట్ నెం. 23), పెంచికల్‌పేట్ (గెజిట్ నెం. 26) దుకాణాలను కేటాయించినట్లు తెలిపారు. ఏజెన్సీకి సంబంధించి ఖర్జెవల్లి (గెజిట్ నెం.29) దుకాణానికి కేటాయించినట్లు వివరించారు. పట్టణంలోని ఐదు దుకాణాలతో పాటు నజ్రుల్‌నగర్, సిర్పూరు (టి), కౌటాల, రవీంద్రనగర్, గూడెం, బెజ్జూరు, దహెగాంలలో ఒక్కొక్కటి చొప్పున జనరల్‌కు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 18లోగా ఆసిఫాబాద్ ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా చేనేత దినోత్సవం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో కోసిని చేనేత సహకార సొసైటీలో చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. వారికి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుడిక్యాల రాజమౌళి, హన్మాండ్ల కేదారి, గౌరవాధ్యక్షులు సామల రాజయ్య, నాయకులు నల్ల కనకయ్య, గడదాసు మల్లయ్య, పొన్న ప్రవంతి, రమాదేవి, సునీత, ఎన్నం అశోక్ పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

నెన్నెల మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై వచ్చిన ఎన్ భువనేశ్వర్ సోమవరా సిర్పూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీరించారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ రియాజ్‌అలీ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

• ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-నస్పూర్

నూతన విద్యా విధానం 2020ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపెల్లి తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అసెంబ్లీ సందర్భంగా ముందస్తు అరెస్టులను ఖండిస్తున్నామని 2020ని రద్దు చేసి తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని అన్నారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, తక్షణమే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. పాఠ్యపుస్తకాలు తక్షణమే ఇవ్వాలని అన్నారు. ప్రయివేట్ యూనివర్సిటీ రాష్ట్రంలో అనుమతించవద్దని, గత మూడేళ్లుగా రూ.5,177 కోట్లు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని, మంచిర్యాల జిల్లా కేంద్రంలో పాత కలెక్టరేట్ భవనాన్ని ఎస్సీ బాలికల వసతి గృహానికి ఇవ్వాలని పేర్కొన్నారు. అంతేకాకుండా మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రతి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఈదునూరి అభినవ్, బండి సత్యనారాయణ, నస్పూర్ మండల సహాయ కార్యదర్శి పల్లవేణి రాకేష్ పాల్గొన్నారు.

16 నుంచి రెండో ఏఎన్ఎంల సమ్మె

• ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని లేదంటే ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ హెచ్చరించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి డీఆర్ఓకు వినతి పత్రం ఇచ్చిన అనంతరం కార్యవర్గ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 సంవత్సరాల నుంచి చాలిచాలని వేతనాలు తీసుకుంటూ పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్న రెండవ ఏఎన్ఎం, ఈసీ ఏఎన్ఎం, అర్బన్ ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. గత నెల 26వ తేదీన ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం పట్టించుకోకపోగా కొత్త నోటిఫికేషన్ వేయడం దారుణం అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 16 నుండి నిరవధిక సమ్మెకు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోషి, రజిని, శోభ, పుణ్యవతి, లక్ష్మి, సూర్యకళ, ప్రమీల, భూదేవి, సునీత పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక

రెండవ ఏఎన్ఎంల సంఘం (ఏఐటీయూసీ) కుమురంభీం జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, జిల్లా అధ్యక్షురాలుగా సంతోషి, జిల్లా ఉపాధ్యక్షులుగా రజిని, శోభ, భాగ్య, ప్రధాన కార్యదర్శిగా దుర్గం పుణ్యవతి, సహాయ కార్యదర్శులుగా లక్ష్మీ, సూర్యకళ, కమల, ప్రచార కార్యదర్శిగా భూదేవి, ప్రమీల, కోశాధికారిగా సునీత ఎన్నికయ్యారు.

ఎస్ఆర్పీ-1 గని నూతన పిట్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఎస్ఆర్పీ-1 గని నూతన పిట్ కమిటీని ఎన్నుకున్నట్లు బ్రాంచ్ కార్యదర్శి మోత్కూర్ కొమురయ్య తెలిపారు. సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నర్సయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్ఆర్పీ గ్రూప్ బ్రాంచ్ కార్యదర్శి మోత్కూర్ కొమురయ్య హాజరై మాట్లాడారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ దశాబ్ద కాలాల నుంచి సింగరేణి కార్మికుల అనేక పోరాటాల ద్వారా సింగరేణి కార్మికులకు హక్కులు సాధించి పెట్టింది అన్నారు. సింగరేణి కార్మికులు అనుభవిస్తున్న ఒక్కొక్క హక్కు వెనుక ఒక్కొక్క నాయకుడి ప్రాణ త్యాగం ఉందని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. సింగరేణి కార్మికులు అనుభవిస్తున్న లాభాల వాటా, దీపావళి బోనస్ అనేక సంక్షేమ హక్కులు ఏఐటీయూసీ సాధించి పెట్టిందని అన్నారు. ఇప్పుడు ఉన్నటువంటి గుర్తింపు సంఘం నూతన హక్కులు సాధించకపోగా సాధించిపెట్టిన హక్కులను తుంగలో తొక్కుతున్నాయన్నారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 16వ మహాసభలు గోదావరిఖనిలో అంగరంగ వైభవంగా నిర్వహించబోతున్నామని, దీనికి కేంద్ర రాష్ట్ర నాయకత్వం హాజరవుతుందని, శ్రీరాంపూర్ డివిజన్ నుంచి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర మహాసభలలో 11వ వేజ్ బోర్డు సంబంధించి ఏరియర్స్‌ని యాజమాన్యం ఒకే దఫా చెల్లించాలని, లాభాల వాటా 35శాతం చెల్లించాలని, నూతన అండర్ గ్రౌండ్ మైండ్స్ ప్రారంభించాలని, ప్రయివేటీకరణ కాంట్రాక్టీకరణ వ్యతిరేకంగా తీర్మానాలు చేసి భవిష్యత్ పోరాటాలకు రాష్ట్ర మహాసభలు వేదిక కాబోతున్నాయన్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు రాచర్ల చంద్రమోహన్, గునిగంటి నర్సింగరావు, మురళి చౌదరి పాల్గొన్నారు.

సామల సదాశివ మాస్టారుకు నివాళి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ సామల సదాశివ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహం వద్ద ఘన వివాళ్లు అర్పించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ వైస్ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు సాహిత్యరంగానికి సామల సదాశివ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ తెలంగాణ తల్లి చౌరస్తా వరకు సాగింది. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి వెంకటేష్, కొంగ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

పద్మశాలి యుద్ధభేరిని విజయవంతం చేయాలి

ఈ నెల 13న కోరుట్లలో నిర్వహించే పద్మశాలి యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని పద్మశాలి సేవా సంఘం నాయకులు కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే ఈ పద్మశాలి ఆత్మీయ గౌరవ సభలో పద్మశాలీల సమస్యలు చర్చించడంతో పాటు శక్తిని చాటుకోవాలని వారు సూచించారు.

ఆర్కే-6 గనిలో భద్రతపై అవగాహన



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 గనిలో సురక్షిత పని విధానాలు, పద్ధతులు అమలుపై సోమవారం భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, ఆర్కే-5,6 ఏజెంట్ ఏవి రెడ్డి, ఎస్ఎంటీసీ ఎస్ఓఎం విజయకుమార్, ఎస్ఓఎం తిరుపతి, గ్రూప్ ఇంజనీర్ వీరన్న హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏ, బి, సి, డి సేఫ్టీ కల్చర్ గుర్తుంచుకోవాలని యాటిట్యూడ్(ఏ), బిహేవియర్(బి), కల్చర్(సి), డిసిప్లేన్(డి) తన జీవన విధానంలో అలవాటు చేసుకోవాలని కోరారు. 2014 సంవత్సరం నుండి జరిగిన గని ప్రమాదాలు, సహజ మరణాలు రోడ్డు ప్రమాదాలు, దీర్ఘకాలిక వ్యాధులు తీసుకోవాల్సిన నివారణ చర్యల గురించి వివరించారు. నా భద్రత నా బాధ్యత అని, నా భద్రత నా కుటుంబ భద్రతా అనే నినాదంతో రక్షణపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్పత్తిని సాధించాలని కోరారు. రక్షణ అనేది తమ ఇంటి నుండే మొదలవ్వాలని శిరస్త్రాణం ధరించి విధులకు రావాలని పేర్కొన్నారు. ఆర్కే-6 గని ఉత్పత్తి లక్ష్యాన్నే కాకుండా రక్షణపై అవగాహన కార్యక్రమాలు ప్రతి రోజు ఎస్ఓపీల ద్వారా ఉద్యోగులకు కల్పిస్తున్నదని, అలాగే ఉద్యోగులు ఆరోగ్య నిమిత్తం డాక్టర్‌లచే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నదని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోనే కాకుండా కంపెనీ స్థాయిలో ఆర్కే-6 గని రక్షణతో కూడిన ఉత్పత్తిలో ముందంజలో ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి కె.శ్రీనివాస్, సంక్షేమాధికారి కె.సునిల్ కుమార్, పిట్ ఇంజనీర్ అందె శ్యామ్, ఇంజనీర్ ఆర్.మహేష్ పాల్గొన్నారు.

9న గద్దర్ సంస్మరణ సభ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రజా గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు గద్దర్ సంస్మరణ సభను తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదిన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, బాల్క శ్యాంకుమార్, దెబ్బటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పద్మశాలి భవన్‌లో సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించే ఈ సభకు ఉద్యోగ, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, తెలంగాణ ఉద్యమకారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా బీపీ మండల్ డే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీపీ మండల్ డే వేడుకలను జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. జడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి మండల్ ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, ఎంపీడీఓ శశికళ, ఎంపీఓ ప్రసాద్, అప్పపెళ్లి సర్పంచ్ బాబురావు, బురుగుడ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, రామగౌడ్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో క్రైస్తవులపై జర్గుతున్న దాడులు ఆపాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య లౌకిక సామ్యవాద దేశంగా పేరొందిన దేశంలో క్రైస్తవులపై, దళితులపై దాడులు జరగడం అవమానకరమని క్రైస్తవ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు విల్‌ఫ్రెడ్ ఆవేధన వ్యక్తం చేశారు. సోమవారం మండలకేంద్రంలోని బిలీవర్ చర్చిలో నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం మణిపూర్‌లో జరిగిన క్రైస్తవులపై, ఆదివాసులపై మతోన్మాదులు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యం అని చెప్పుకొనే దేశంలో ఇలాంటి మతత్వ శక్తులు తమ రాజకీయ స్వావలంబన కోసం ఈ విధంగా దాడులు చేయడం సరికాదన్నారు. రాబోవు ఎన్నికల్లో క్రైస్తవులకు, దళితులకు, ఆదివాసులకు సహకరించే పార్టీలను బలపరుస్తామని సమావేశంలో తీర్మానించడం జరిగిందని, అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో పాస్టర్లు ప్రకాశం, తిమోథి, మోజేస్, సుకుమార్, దిలీప్ పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో జీపీ కార్మికుల రాస్తారోకో



నవతెలంగాణ-రెబ్బెన

గ్రామ పంచాయతీ కార్మికులు తమ హక్కుల సాధనకు 33 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం కార్మికుల సమస్యలు పట్టించుకోవడంలేదని సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత తొమ్మిది సంవత్సరాల నుండి గ్రామ పంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచడానికి ప్రభుత్వానికి ఉన్న సమస్య ఏంటని వారు ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కరోనా సమయంలో గ్రామ పంచాయతీ కార్మికులు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా రెడ్‌జోన్‌లోకి వెళ్లి ప్రజల ప్రాణాలను కాపాడడంలో అత్యంత కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగవెల్లి సుధాకర్, వెంకటేశ్, రమేష్, శంకర్, ప్రకాష్, సునీల్, శ్రీనివాస్, ధర్మయ్య, పోచయ్య మహేందర్, శోభ, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ డి రవిప్రసాద్ సూచన మేరకు ఆజాదిక అమృత్ మహోత్సవంలో భాగంగా గోలేటిలోని సింగరేణి హైస్కూల్లో విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 75 ఏండ్ల స్వాతంత్ర్య ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఆజాదిక అమృత్ మహోత్సవ్ దేశ స్వాతంత్ర్య సమరయోధులు అనే అంశంపై విద్యార్థులు ఉపన్యాసం ఇచ్చారు. గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15న జీఎం కార్యాలయం ఆవరణలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతుల ప్రధానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఐ లక్ష్మణ్‌రావు, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్లరెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, సమత పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

• ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు షేక్ జాఫర్



నవతెలంగాణ-కెరమెరి

విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ముట్టడిలో కార్యక్రమంలో భాగంగా ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు విచక్షణ రహిత దాడి చేసి, అక్రమ అరెస్టులు చేయడాన్ని ఖండించారు. మూడు సంవత్సరాల నుండి విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.5177 కోట్ల బకాయిలు ఉన్న విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరేఎత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు, విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం, పైచదువులకు వెళ్లకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్‌లో ఉన్నటువంటి స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. విద్యార్థులపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, కళాశాల, యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్నటువంటి అధ్యాపకుల పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులు సమస్యలను పరిష్కరించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అంతకుముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచందర్, బావాజీ, మారుతి, పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేవంలో వారు మాట్లాడారు. మండలంలోని ఆదివాసీ గ్రామాల్లోపటేల్ దేవరి అధ్వర్యంలో ఆగస్ట్ 9న ఉదయం జెండా ఆవిష్కరణ చేసి, మండల కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి అనంతరం మంచిర్యాలలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు మడవి వెంకటేష్, కుమ్రం జనార్ధన్, మడవి భీమ్‌రావ్, ఎంపీటీసీ మడావి గంగారాం, పెంద్రం శంకర్, సిడం గణపతి, ఆత్రం సంజీవ్, ఉయిక మోతీరం, పెంద్రం ప్రభాకర్, ఆత్రం మహేష్, మెస్రం భీమ్ రావ్, కొడప జైరాం, సెడ్మకి రాధ, మడవి భోజ్జిరావ్ పాల్గొన్నారు.